జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
సోమవారం 25 మే 2026 ◆ పేజీలు : 5

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.



**నారాయణపేట ప్రతినిధి మే 24 (ప్రజాజ్యోతి)** నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ... బక్రీద్ పండుగ సందర్భంగా కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు

మిగతా 2 లో...




# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి మే 24 (ప్రజా జ్యోతి)** జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను

మిగతా 2 లో...

## రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు – ప్రజల్లో ఆందోళన

- భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యుత్ అధికారులపై విమర్శలు



**మహమ్మదాబాద్, మే 24 ( ప్రజా జ్యోతి)** మహమ్మదాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు భద్రతా ప్రమాణాలు లేకుండా ఉండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనలను పట్టించుకోకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఏర్పాటు చేసే దిమ్మెలు కనీసం 12 అడుగుల ఎత్తులో ఉండాల్సి ఉండగా, అనేక చోట్ల తక్కువ ఎత్తులోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో చిన్నపిల్లలు, పశువులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే రహదారికి కనీసం 10 అడుగుల దూరంలో

మిగతా 2 లో...

## కొల్లాపూర్ చౌరస్తాలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు



2 లో...

## మే 25 నుంచి 30 వరకు "మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహణ

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు
- మహిళా సంక్షేమం,బాలికల రక్షణ,జీవనోపాధి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత





కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ :మే 24 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లాలో మే 25నుంచి 30వరకు "మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.మే 25 నుంచి 30 వరకు జిల్లా లోని వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాల అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా

మిగతా 2 లో...

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లయ్ సైదులు, డి డబ్ల్యూ రాజేందర్ గౌడ్, డీ ఏ వో జాన్ సుధాకర్, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ చౌరస్తాలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

- -పట్టించుకోని అధికారులు



**నాగర్ కర్నూల్ : మే 24 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొల్లాపూర్,కల్వకుర్తి అచంపేట్,పెద్దకొత్తపల్లితో పాటు పట్టణ ప్రజలు జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ కార్యాలయాలకు పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రయాణికులు షాపులు,గోడల నీడలను అశ్రయిస్తూ బస్సుల కోసం ఎదురుచూస్తు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మే 25 నుంచి 30 వరకు “మహిళా ఆర్థిక వారోత్సవం” నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి...)

,ఈ నెల 25వ తేదీ నుండి 30వ, తేదీ వరకు జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో పలు సంక్షేమ,అవగాహన,అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్,డి.ఆర్.డి.ఏ చైర్మన్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ,పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా సంక్షేమశాఖల సమన్వయంతో కార్యక్రమాలు అమలుపై ఆదివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించి కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత,బాలికల భద్రత,జీవనోపాధి కల్పన,విద్యా ప్రోత్సాహం,అంగన్వాడీ సేవల బలోపేతం ప్రధాన లక్ష్యాలుగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.మే 25న, అంగన్వాడీ భవనాల ప్రారంభోత్సవాలు,మే 25న రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా VO MS,NHC,నూతన అంగన్వాడీ భవనాల ప్రారంభోత్సవాలు,పలు ప్రాంతాల్లో భూమిపూజ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మరియు చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు అధికారులు తెలిపారు.అదే రోజు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల కోసం వంటల పోటీలు నిర్వహించి సంప్రదాయ ఆహార సంస్కృతి,పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించబడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ సభలు మే 26న,గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు గ్రామ స్థాయి తీర్మానాలు చేయనున్నారు.మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం అందజేసిన బస్సులను ప్రతినిధులు జెండాఊపి ప్రారంభించనున్నారని,ఈ బస్సులు మహిళల ఆర్థిక,సామాజిక కార్యకలాపాలకు దోహదపడనున్నాయని అధికారులు తెలిపారు. మే 27న, లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై అవగాహన జిల్లా స్థాయిలో ఉద్యోగ స్థలాల్లో మహిళల రక్షణకు సంబంధించిన లైంగిక వేధింపుల నిరోధక చట్టాల అమలుపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి కార్మిక శాఖ సమన్వయంతో ఉద్యోగులు,మహిళా సిబ్బందికి చట్టపరమైన హక్కులు,ఫిర్యాదు వ్యవస్థ,రక్షణ చర్యలపై వివరణ ఇచ్చి,మండల మహిళా సమాఖ్యల ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాలు నిర ్వహించి, నాయ క త ్వ మార్పులు,సంఘాల బలోపేతం,జీవనోపాధికి నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించనున్నారు.ఉత్తమంగా పనిచేసిన మండల సమాఖ్యలకు సత్కారాలు అందజేయడంతో పాటు 2026–27 సంబంధించి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించనున్నారు. మే 29న, జిల్లా స్వయం సహాయక సంఘాల (SHG) లోన్ మేళాలు నిర్వహించనున్నారు.సెర్ప్ ఆధ్వర్యంలో అమలవుతున్న జీవనోపాధి పథకాల ను అర్హులైన లబ్ధిదారులకు అందజేసి మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడేందుకు బ్యాంకు రుణాలు,ఆర్థిక సహకారం,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిదంగా వృద్ధ మహిళలకు సంబంధించిన సమస్యలను గుర్తించి,వారి సంక్షేమానికి చర్యలు చేపట్టి వృద్ధ మహిళల జీవనానికి అవసరమైన సహాయ కార్యక్రమాలు అమలు చేసి మే 30న, “అమ్మకు అక్షరమాల” కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించనున్నట్లు వారు తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థ,నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యతలపై బాలికలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని “అమ్మ మాట – అంగన్వాడీ బాట” కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లోని బాల బాలికలకు యూనిఫారాలను పంపిణీచేసి కేంద్రాలను శుభ్రపరిచి పునఃప్రారంభానికి సిద్ధం చేసి చిన్నారులకు పరిశుభ్రమైన సురక్షితమైన వాతావరణంలో సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**కల్వకుర్తి, మే 24 (ప్రజా జ్యోతి ):** విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముకరాల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముకరాల గ్రామానికి చెందిన వర్సు శివ (32) వరి ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్లి దాన్యం అరబెట్టి దాహం వేయడంతో సమీపంలోని గోరెంట్ల ఎల్లయ్య బోరు మోటర్ దగ్గరికి వెళ్లి నీరు పట్టుకోడానికి వెళ్లడంతో ప్రమాదవశత్తు కరెంటు వైర్ తగిలి అకస్మాత్తుగా విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. మృతునికి భార్య తో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య మెహరాన్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# పదో తరగతి ప్రతిభావంతుల విద్యార్థులకు ఘన సన్మానం



**చిన్నంబావి మే 24 (ప్రజా జ్యోతి)** చిన్నంబావి మండలంలోని కొప్పునూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబర్చడంతో గ్రామ అంబేద్కర్ యువజన సంఘం, జై భీమ్ స్నేహ సేవ సమితి ఆధ్వర్యంలో 17 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎస్సై రామన్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు శాలువాలు కప్పి, షీల్డ్ మొమెంటోలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై రామన్ గౌడ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ కాలనీకి చెందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.జై భీమ్ స్నేహ సేవ సమితి అధ్యక్షుడు సింగరిగల్ల వెంకటస్వామి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమ సంఘం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మునిస్వామి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు విష్ణు,మద్దిలెట్టి, బిస్మా,తలారి వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు తలారి నిర్మలమ్మ, చెన్నయ్య,సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ లేకుండా ట్రాన్స్ఫార్మర్లు – ప్రజల్లో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి...)

ఉండాల్సిన ట్రాన్స్ఫార్మర్లు కొన్ని చోట్ల కేవలం 3 నుంచి 4 అడుగుల దూరంలోనే ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ ముళ్ల కంచె, రక్షణ వలయం లేకపోవడం మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. ట్రాన్స్ఫార్మర్ల పరిసరాల్లో చెట్లు, ముళ్ల పొదలు, గడ్డి, చెత్త తొలగించాల్సి ఉన్నప్పటికీ అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ట్రాన్ఫ◌ార్మర్లు పేలినప్పుడు లేదా మంటలు చెలరేగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన కూడా జరిగిందని గుర్తుచేశారు. రాబోయే వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు జరగకుండా వెంటనే భద్రతా చర్యలు చేపట్టి ప్రజలతో పాటు మూగజీవాల ప్రాణాలను కాపాడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

# సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

(మొదటి పేజీ తరువాయి...)

అయిన , ఫేస్బుక్ ట్విట్టర్ ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

# తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం శ్రీనివాస్‌కు ఘన సన్మానం

- **గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు మరువలేను: డాక్టర్ గడ్డం శ్రీనివాస్**



**చిన్నంబావి మే 24 (ప్రజాజ్యోతి)** చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గడ్డం శ్రీనివాస్ తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా స్వగ్రామానికి విచ్చేయగా గ్రామ ప్రజలు,అభిమానులు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మాస్ మీడియా ఆఫీసర్ డాక్టర్ గడ్డం తిరుపతి రావు, గ్రామ సర్పంచ్ భర్త కేతాపాగ లక్ష్మయ్య మూలే రామకృష్ణ, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వారి ఆశీస్సులు పొందారు.అనంతరం గ్రామ పెద్దలు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాస్ మీడియా ఆఫీసర్ డాక్టర్ గడ్డం తిరుపతిరావు మాట్లాడుతూ, “మన పెద్దమారూర్ గ్రామానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవిని చేపట్టడం గ్రామానికే గర్వకారణం.తెలంగాణ ఉద్యమం, జేఏసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన డాక్టర్ గడ్డం శ్రీనివాస్ అంచెలంచెలుగా ఎదిగి కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉంది” అని అన్నారు.గ్రామ సర్పంచ్ భర్త కేతాపాగ లక్ష్మయ్య మాట్లాడుతూ, “డాక్టర్ గడ్డం శ్రీనివాస్ వంటి నాయకులు యువతకు ఆదర్శం. సమాజ సేవ, ఉద్యమాల ద్వారా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించి ఈ స్థాయికి చేరుకోవడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం” అని కొనియాడారు. డాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ, “బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా నా స్వగ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం చివరి వరకు కృషి చేస్తాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం సాధన కోసం మరింత కట్టుబాటుతో పనిచేస్తాను. నాకు ఈ స్థాయిలో ప్రేమాభిమానాలు చూపిస్తున్న పెద్దమారూర్ గ్రామ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటాను” అని భావోద్వేగంగా తెలిపారు.తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకుడిగా, దళిత–బహుజన ఉద్యమాలకు నాయకత్వం వహించిన డాక్టర్ గడ్డం శ్రీనివాస్ ప్రస్తుతం టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో, నిజాయితీతో పార్టీ పట్ల.అంకితభావంతో పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జాతీయ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మరియు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ఏఐసీసీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ డిపార్ట్‌మెంట్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. మాస్ మీడియా డాక్టర్ గడ్డం తిరుపతి రావు, సర్పంచ్ భర్త కేతపాగ లక్ష్మయ్య, కండక్టర్ శ్రీహరి, మూ లే రామకృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ బిజ్జ చంద్రశేఖర్, గడ్డం గణేష్, గడ్డం కృష్ణయ్య, గడ్డం గంగరాజు, గడ్డం నరసింహ, పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయ సాధనకు కృషి చేద్దాం

- **వనపర్తి అభివృద్ధికి జయరాములు సేవలు చిరస్మరణీయం: అఖిలపక్ష ఐక్యవేదిక**



**వనపర్తి, మే 24 (ప్రజాజ్యోతి):** వనపర్తి దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములుకు అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. మర్రికుంటలోని ఆయన సమాధి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి, డీఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. చిన్న నియోజకవర్గంగా ఉన్న వనపర్తిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లిన నాయకుడు జయరాములు అని కొనియాడారు. వనపర్తికి పాలకేంద్రం, కోర్టు, బస్టాండు సాధించడంలో ఆయన కృషి విశేషమని తెలిపారు. డిగ్రీ కళాశాల స్థాపన ద్వారా వనపర్తిని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయకుడు రాజారాం ప్రకాష్ బృందం పాటలతో అలరించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి రాము యాదవ్, డీఎస్పీ అధ్యక్షుడు రామకృష్ణ మహారాజ్, టిడిపి నాయకులు ఆవుల శీను, చిన్నయ్య యాదవ్, సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్ గౌడ్, కిరణ్ కుమార్, బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి మైబూస్, గంధం నాగరాజు, దేవన్న నాయుడు తదితరులు జయరాములు సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో జయరాములు కుటుంబ సభ్యులతో పాటు బీసీ నాయకులు చీర్ల చందర్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, కాంగ్రెస్ నాయకులు బొంబాయి బాలకొండయ్య, సమద్, వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు కాగితాల లక్ష్మయ్య, యాదవ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి గురురాజ్ యాదవ్, విజేత రాములు, గంధం బాలరాజు, పి. ఈ.టీ మురళి, శివకుమార్, నాగరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ లోకపల్లి లక్ష్మమ్మ గుడి కమిటీ నూతన అధ్యక్షుడు శ్రీ కూరగాయల శశికాంత్ యాదవ్ ని సన్మానం



**నారాయణపేట ప్రతినిధి మే 24 (ప్రజా జ్యోతి)** ఈరోజు పట్టణంలోని భావ సమైక్యవేదిక మరియు లోకాయపల్లి వేణుగోపాల స్వామి గుడి గౌరవాధ్యక్షుడు శ్రీ జి కురుమన్న గారి స్వగృహంలో వారి సమక్షంలో పట్టణంలోని యాదవ కుల బంధువులు ఇటీవల లోకపల్లి లక్ష్మమ్మ గుడి కమిటీకి నూతన అధ్యక్షులుగా ఎన్నుకోబడిన కూరగాయ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు అయినా శ్రీ కూరగాయల శశికాంత్ యాదవ్ గారిని యాదవ కుల బంధువులందరూ కలిసి పెద్ద ఎత్తున సన్మానం చేశారు.సన్మానం చేసిన వారిలో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులకు వీరు యాదవ్ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి వెంకట్రాముడు యాదవ్ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిన్నయ్య యాదవ్ చెన్నకేశవులు యాదవ్ గోపాల స్వామి గుడి కమిటీ అధ్యక్షుడు రామప్ప యాదవ్ లతోపాటు యాదవ సంఘం జిల్లా రాష్ట్ర నాయకులు బైరంకొండ నరసింహులు యాదవ్జీ వినయమిత్ర యాదవ్ జి రణధీర్ యాదవ్ చంద్రకాంత్ యాదవ్ రమేష్ యాదవ్ వెంకటేష్ యాదవ్ డాక్టర్ రాజ్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ పెద్దలు చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సలహాదారులు అయిన శ్రీ జి కురుమన్న గారు మాట్లాడుతూ లక్ష్మమ్మ గుడికి అధ్యక్షులుగా సేవ చేసే భాగ్యం పూర్వజన్మ సుకృతం ఉంటే తప్ప దొరకదని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఈ సంస్థానానికే మహారాణి అయిన చరిత్రత్మక లోకాపల్లి సంస్థానపు రాణిగా పరిపాలన చేయడమే కాకుండా ఈ ప్రాంత ప్రజల కొంగుబంగారమై వారి కొరవే కోరికలు నెరవేరుస్తూ మన ఆశీర్వదిస్తూ ఉన్న రాణి లక్ష్మీ దేవమ్మ లోకపల్లి లక్ష్మమ్మను సేవ చేసే భాగ్యం కలిగినందుకు శశికాంత్ ఆశీర్వదిస్తూ మనమందరము కూడా ఆమెకు సేవ చేస్తూనే మన నేలలో నడయాడిన చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన లో కపల్లి లక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టాపన కూడా చేస్తున్న సందర్భంగా మనమందరము మన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని తను మన ధన పూర్వకంగా ఆ శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఏ.ఎన్.ఎం. నిరంజనమ్మ కు అథ్లెటిక్స్ పోటీలో బంగారు పతకం

- **అభినందించిన జిల్లా వైద్యాధికారి రవికుమార్ నాయక్**




**నాగర్ కర్నూల్ : మే 24 (ప్రజా జ్యోతి)** నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండలంలోని ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రంలో ఏ.ఎన్.ఎం.గా విధులు నిర్వహిస్తున్న అలువాల నిరంజనమ్మ నాగర్‌కర్నూలు జిల్లా స్థాయి పురుషులు, మహిళలు మరియు జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించింది.ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మహిళల విభాగంలో డిస్కస్ త్రోలో వెండి పతకం, షాట్‌పుట్ త్రోలో బంగారు పతకం సాధించి వైద్య ఆరోగ్యశాఖకు గర్వకారణంగా నిలిచారు.గతంలో కూడా అనేక పతకాలు సాధించిన నిరంజనమ్మ భవిష్యత్తులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మరింత ప్రతిభ కనబరుస్తారని తెలిపారు. నిరంజనమ్మ సాధించిన విజయం పట్ల బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. గుంపల్లి నాగేశ్వరి,గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్,ఆమె భర్త జిలకరి శంకర్, గౌరెడ్డిపల్లి గ్రామస్తులు నిరంజనమ్మను అభినందించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి అందరికీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నేటి నుండి సబ్సిడీపై రైతులకు జీలుగా విత్తనాలు పంపిణీ

- **నర్వ ఏవో అఖిల రెడ్డి**

నారాయణపేట జిల్లా నర్వ మండలం కేంద్రంలోన ఆగ్రోస్ సెంటర్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని నేటి నుండి సబ్సిడీపై అందజేస్తామని నర్వ వ్యవసాయాధికారిని అఖిలారెడ్డి ఆదివారము ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుండి జీలుగ విత్తనాల పంపిణీ సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారువ్యవసాయ భూముల్లో కర్బన శాతాన్ని పెంచి, నేల సారాన్ని మెరుగుపరచడానికి పచ్చిరొట్ట ఎరువుల పంటలు ఎంతో ఉపయోగకరము, ముఖ్యంగా జీలుగ పంటను పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేయడం ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి, భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గుతుంది.జీలుగ పంట వేగంగా పెరిగి అధిక పచ్చి జీవపదార్థాన్ని అందించడం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. తద్వారా భూమి తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడి, తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుంది.జీలుగ విత్తనాల పూర్తి ధర క్వింటాల్‌కు రూ.16,350 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై క్వింటాల్‌కు రూ.8,175 మాత్రమే రైతులకు అందజేయబడుతుంది.విత్తనాలు ఆగ్రోస్ నర్వ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.



రైతులు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓ లను సంప్రదించి పర్మిట్ తీసుకుని విత్తనాలను పొందగలరు.అధిక ప్రయోజనాలు కలిగిన పచ్చిరొట్ట ఎరువుల పంటలను రైతులు విస్తృతంగా సాగు చేసి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ద్వారా కోరుతున్నాము.అఖిల రెడ్డి మండల వ్యవసాయ అధికారిని

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి మే24:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని హన్మ్య నాయక్ తండాలో ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ వారికి శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హన్మ్య నాయక్ తండా సర్పంచ్ రాజు నాయక్, ఉప సర్పంచ్ రమేష్ నాయక్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం

- **ఈనెల 25న ఐడీఓసీ వద్ద నిర్వహణ**

**మహబూబ్‌నగర్, మే 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 25వ తేదీ సోమ వారం ఉదయం 10 గంటల నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ లో జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి జరీనా బేగం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పోషకాహార పదార్థాల తయారీ, ప్రదర్శన నిర్వహించనున్నారు. అలాగే సమతుల్య ఆహారం (డైటరీ డైవర్సిటీ) పై అవగాహన కల్పించనున్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటించడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండడంపై సామూహిక పోషకాహార అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా) పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సీడీపీఓలు, ఆశా కార్యకర్తలు మరియు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని డీడబ్ల్యూఓ జరీనా బేగం సూచించారు.

# అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

- **బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో నిర్వహణ**



**మహబూబ్‌నగర్, మే 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని ఏనుగొండలో గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సన్నది అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అనాథాశ్రమంలోని చిన్నారులు, వృద్ధులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగొండ కార్పొరేటర్ రామస్వామి, కర్ణం రవి, శ్రీకాంత్ గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొని స్వయంగా పండ్లను పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు.

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం.. రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి

- **తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనాలి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ**





**వనపర్తి, మే 24 (ప్రజాజ్యోతి):** గత రాత్రి కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆరోపించారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి, అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదని విమర్శించారు. గత రాత్రి కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. ధాన్యం రవాణా టెండర్లను కాంగ్రెస్ పార్టీ నాయకులకు అప్పగించడం వల్ల అనుభవలేమితో లారీలు సమకూర్చడంలో విఫలమయ్యారని, దీంతో రైతులు సొంత ఖర్చులతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులను బాధ్యులుగా చేస్తే బీజేపీ సహించదని హెచ్చరించారు. తడిసిన లేదా మొలకెత్తిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతు భరోసా, రుణమాఫీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పక్కనబెట్టి ప్రైవేటు కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇచ్చారా అని ప్రశ్నించారు. పాలన చేతకాకపోతే బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, కోశాధికారి బండారు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు కొత్తకాపు శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు గుంటి శివ, ద్వారపోగు సుబ్రహ్మణ్యం, బోయెళ్ల రాము, లక్ష్మీకాంతరెడ్డి, చిన్నయ్య యాదవ్, సత్యనారాయణ రావు, మండ్ల రాజు, తిరుపతి యాదవ్, చిన్న రాయుడు, నక్క మహేష్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో సోలార్ శక్తి కీలకం

- **ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలి**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి, మే 24 (ప్రజాజ్యోతి):** భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే సోలార్ శక్తి వినియోగం అత్యంత అవసరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని జిల్లెల తిరుపతి రెడ్డి నివాసంపై టాటా కంపెనీ 5 కిలోవాట్ల 1 ఫేజ్ సామర్థ్యంతో భారత్ సోలార్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ను ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే సోలార్ శక్తి వినియోగం అత్యంత అవసరమని పేర్కొన్నారు. సూర్యకాంతి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో సోలార్ ఎనర్జీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంతో రైతులు, చిన్న వ్యాపారులు విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు సోలార్ ప్లాంట్లు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పునరుత్పాదక శక్తి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీలు అందిస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. యువత గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, ఆదా, పర్యావరణ పరిరక్షణ అనే మూడు లక్ష్యాలను సోలార్ శక్తి సాధిస్తుందని, అందరూ సోలార్ ప్లాంట్ల వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భారత్ సోలార్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఎండీ రాజు యాదవ్, సోలార్ టెక్నీషియన్లు శీను, రూమిబాయ్, నాగరాజు, కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ ఈశ్వర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# దాహార్తి తీర్చిన సర్పంచ్.. సంతోషంలో కాలనీ వాసులు



**మహమ్మదాబాద్, మే 24 ( ప్రజా జ్యోతి )** మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచ్ రాం లాల్ పరిష్కారం చూపించారు. కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ శుక్రవారం కొత్త బోరు వేయించి ప్రజల దాహార్తి తీర్చారు. గత కొన్ని రోజులుగా కాలనీలో తీవ్ర నీటి సమస్య నెలకొనడంతో తాము దూర ప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకునే వారమని స్థానికులు తెలిపారు. తమ సమస్యను తెలుసుకుని వెంటనే స్పందించి బోరు వేయించిన సర్పంచ్ రాం లాల్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాం లాల్ మాట్లాడుతూ గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన డా. వెన్న ఈశ్వరప్ప



**మే 24గండీడ్ ప్రజా జ్యోతి**మండలం వెన్నచేడ్ గ్రామానికి చెందిన గొంద్యాల చిన్న చెన్నయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్ప రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి గడ్డమీది మల్కయ్య, గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చాకలి బాలయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు దొడ్డే రాములు, మాజీ ఎంపీటీసీ గొంద్యాల దశరథ్, గ్రామ వార్డు సభ్యులు కాకి ఆంజనేయులు, ఒగ్గు నరేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు రాములు, నరేందర్, బీజేపీ యువ నాయకులు గోపాల్, హరీష్, మల్లేష్, జ్ఞానేశ్వర్, వెంకటేష్, గ్రామ పెద్దలు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం

**మహబూబ్‌నగర్, మే 24 (ప్రజా జ్యోతి బ్యూరో)**



జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అకాల వర్షాల వల్ల రైతుల ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక మహిళా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ సీజన్‌లో తెలంగాణ రైతుల నుంచి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రూ.45 వేల కోట్లకు పైగా చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. పంటల అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా నేల సారవంతత దెబ్బతింటుందని రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌కు హబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ దరావత్ జానకి హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీలలోని ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన హమాలీలు, స్టోరేజ్ సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అన్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ డీఎం రవి నాయక్, ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘు, మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్-డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ధర్నా




**నాగర్ కర్నూల్ : మే 24 (ప్రజా జ్యోతి)** పెట్రోల్–డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.పెట్రోల్,డీజిల్ ధరలు పెంపు,నీట్ పరీక్ష పత్రం లీకేజీ సంఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నివసిస్తూ నినాదాలు చేశారు.అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్,మల్లేష్,పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోటో గ్రాఫర్ల హెల్త్ కార్డ్ పంపిణీకి తరలి రావాలి

- -కౌకుంట్ల వీరేందర్ గౌడ్



**నాగర్ కర్నూల్ : మే 24 (ప్రజా జ్యోతి)** హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో సోమవారం ప్రముఖ ఫోటో టెక్ సంస్థ యజమాని అభిమన్యు రెడ్డి,ఫోటో ఎడిట్ పాయింట్ రమేష్ సంయుక్తంగా పిపిఐఎన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత హెల్త్ కార్డ్ పంపిణీకి కార్యక్రమానికి తరలిరావాలని ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా నాయకులు కౌకుంట్ల వీరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర సినిమాటోగ్రాఫీ మంత్రి వర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,మాజీ మంత్రి వర్యులు శ్రీనివాస్ గౌడ్,లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ,బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాసులు, పల్లె రవికుమార్ టీజీపీవీ డబ్ల్యూఏ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు ప్రముఖ సంస్థల అధినేతలు హాజరు కానున్నారని కావున ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వంకేశ్వరం నిరంజన్



**నాగర్ కర్నూల్ : మే 24 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వంకేశ్వరం నిరంజన్ ఎన్నికయ్యారు.నిరంజన్ నియామకం పట్ల స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.తనను అధ్యక్షుడిగా నియమించడంపై ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి,దళిత సంఘాల నాయకులకు నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు.

# భరతనాట్యంలో, బాస్కెట్ బాల్ విభాగంలో బంగారు పతకం సాధించిన దేదిప్య











**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.** మొయినాబాద్ లో గల సుజాత పాఠశాలలో ఈనెల 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించిన ఏడవ,టీ బాలికల బి.ఎన్ ఎన్.సి.సి క్యాంప్ నిర్వహించారు. ఎన్.సి.సి క్యాంపుకు జెనెసిస్ ఇంటర్నేషనల్ పాఠశాల అల్వాల్ నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. క్యాంపులో మొదటి రోజు నుండి నిర్వహించిన పలు కార్యక్రమాలు లో భాగంగా ఫైరింగ్ లాంటి విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.అదేవిధంగా ఎన్సిసి క్యాంపులో విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో భరత నాట్యం విభాగంలో దేదిప్య అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ బంగారు పతకాన్ని సాధించారు.ఎన్.సి.సి ఉపాధ్యాయులను, విద్యార్థులను తన భరత నాట్యంతో మంత్రముగ్ధులను చేస్తూ అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు.తాడు లాగు ఆట విభాగంలో దేదీప్య, హన్సిని, గగన,హాసిని సిల్వర్ పతకం, పబ్లిక్ స్పీకింగ్ విభాగంలో నేత్ర బంగారు పథకం, హంసిని సిల్వర్ పతకం సాధించారు.ఆదివారం ఆబోడు పాఠశాలలో నిర్వహించిన అబోర్డు కమ్యూనిటీ లీగ్ బాస్కెట్ బాల్ విభాగంలో జెనెసిస్ పాఠశాల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ట్రోఫీతో పాటు బంగారు పతకాన్ని సాధించారు.ఈ సందర్భంగా బాస్కెట్ బాల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు భారతి రెడ్డిని పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ అఖిల రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభా రెడ్డి,ఉపాధ్యాయులు, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అఖిల రెడ్డి ప్రధానోపాధ్యాయులు శోభా రెడ్డి మాట్లాడుతూ ఏడవ తెలంగాణ బాలికల బి.ఎన్.ఎన్ సి.సి క్యాంపులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, బాస్కెట్బాల్ విభాగంలో ట్రోఫీతోపాటు బంగారు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ మా పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులలో ఉన్న నైపుణ్యతను గుర్తించి ప్రోత్సహిస్తామని అన్నారు.